

# చక్రమ్మ

గోపారాజ్

"అమ్మాయిగోరూ, నాను యెలతన్నానండి" అంది పనిమనిషి చక్రమ్మ.

"అలాగే సాయంత్రం ముందుగా రా. మేం సినిమాకి వెళుతున్నాం" అంది కీర్తన.

"అలాగే అమ్మాయిగోరూ" అంటూ ఆదరా, బాదరాగా పరుగుతీసింది చక్రమ్మ.

కీర్తనకి నారాయణరావుతో పెళ్ళయి అది నాలుగో సంవత్సరం. ఏ బాదరబందీ లేకుండా జీవించాలన్నది వారి కోరిక.

వాళ్ళుంటున్నది టౌనుకు కొంచెం దూరం. సినిమాకి వెళ్ళాలంటే కనీసం ఒక గంటపైన పడుతుంది. ఒక్కోసారి సినిమాకి టైము అయిపోయిందనిపిస్తే ఆటో, టికెట్స్ దొరకకపోతే బ్లాక్. ఆవిడకి బద్ధకంగా ఉంటె ఎ.సి. హొటల్ భోజనం. వారి జీవితం నాలుగు పువ్వులు, నలభై కాయలుగా ఉంది.

ఇంటి దగ్గర కొంప మునిగిపోతోందని ఒక గంట పర్మిషన్ పెట్టి ఆఫీసు నుండి వచ్చాడు నారాయణరావు.

పావుగంటలో తయారయ్యాడు నారాయణరావు. గంటనుంచీ టాయలెట్ అవుతున్నా నారాయణరావు వచ్చేటప్పటికి ఇంకా ఆఖరి టచప్‌లో ఉంది కీర్తన.

"ఎలా ఉందండీ ఈ చీర? ఈ జాకెట్ మాచ్ అయిందా?" అంటూ అతనివైపు తిరిగిన కీర్తనని, పరీక్షగా చూసిన నారాయణరావుకు ఆమె మెడ బోసిపోయినట్లనిపించి-

"నీ చీరకు జాకెట్ మాచింగ్ బాగానే ఉంది కాని, ఇంటివారి నెక్లెస్ ఇచ్చేశావా అని అడిగాడు.

చేత్తో మెడ నవరించుకుంటూ కెవ్వుమంది కీర్తన. నల్లపూసలూ, పసుపుతాడూ తప్ప ఇంకేమీ తగలలేదు ఆమె చేతికి.

భార్య అవస్థ చూసి క్షణంలో ఏం జరిగిందో గ్రహించాడు నారాయణరావు.

ఇద్దరూ కలిసి ఇల్లంతా చిందరవందర చేసి వెతికారు. నారాయణరావు టక్ ఊడిపోయింది, కీర్తన జాకెట్ తడిసిపోయింది.

నెక్లెస్ దొరకలేదు. ఏం చెయ్యాలో తోచక

ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటూ ఉండిపోయారు కాసేపు.

"ఇంటివారి కిచ్చేశావేమో. మరిచిపోయుంటావ్. ఒకసారి కనుక్కో !" అన్నాడు నారాయణరావు విసుగ్గా.

"స్నానం చేసేముందే మెళ్ళోంచి తీసి డ్రెస్సింగ్ టేబుల్ డ్రాయర్లో పెట్టాను. స్నానం చేసి వచ్చి ఇంకా పెట్టుకుందా మనుకున్నాను. ఇవాళ శుక్రవారం కదా రేపు పొద్దుటే ఇద్దామనుకున్నాను" అంది కీర్తన ఆమె కంఠంలో వణుకు.

"వారి వస్తువు వారి కివ్వడానికి శుక్రవారం ఏమిటి? సంతోషించాంగాని ఇంతకీ నెక్లెస్ ఏమయినట్లు?"

"ఆ... సాయంత్రం చక్రమ్మ ఇల్లూడ్చింది. ఇది దాని పనే అయ్యుంటుంది" అంది కీర్తన. ఆధారం దొరకడంతో ఆమె మాటల్లో కొంత రిలీఫ్.

వెంటనే నారాయణరావు సైకిల్మీద వెళ్ళి చక్రమ్మని తీసుకువచ్చాడు.

"అమ్మాయిగేరూ, న న్ననిమానిత్తన్నారా? నాను తియ్యనేదు బాబూ ! నా ననుమంటి దాన్ని కాదు" అంటూ తను కూడా ఇల్లంతా వెతికింది చక్రమ్మ. లేని వస్తువు ఎక్కడ దొరుకుతుంది?

"ఇది ఇలాగే అంటుంది కాని పోలీస్ రిపోర్టివ్వండి. దెబ్బకి దయ్యం వదులుతుంది. నెక్లెస్ బయటపడుతుంది" అంది కీర్తన.

చక్రమ్మ నారాయణరావు కాళ్ళు పట్టుకొని బతిమాలుతోంది. దాని మాటల్లో, కళ్ళలో నిజాయితీ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది నారాయణరావుకి. కాని వస్తువు విలువైనది కావడంతో, ఇతమిత్థమని తేల్చుకోలేక పోలీస్ స్టేషన్కి వెళ్ళాడు.

చక్రమ్మ శరీరం లాఠీదెబ్బలకి హూనం అయింది. ఆ దెబ్బలకి తట్టుకోలేని శరీరం తీశానని అబద్ధం చెప్పమంది. కాని లేని వస్తువు ఎక్కడనుంచి వస్తుంది?

** ** **

నారాయణరావు కాలుగాలిన పిల్లిలా పచార్లు చేస్తున్నాడు. బుర్ర ఆలోచనలతో కాగిపోతోంది.

అప్పు చేద్దామా అంటే వస్తువు విలువయింది, అయిదు వేలు పైచిలుకుంటుంది.

ఉద్యోగం చేసి ఈ అయిదేళ్ళలో మిగిల్చింది ఏమీ లేదు. అంతా సరదాలకే సరాగమయింది.

ఆ సాయంత్రం ఇంటి ఓనర్తో

"ఇది సార్ జరిగింది. నన్ను వీధిన పెట్టకండి. పెద్దమనసు చేసుకుని, ఒక సంవత్సరం టైమివ్వండి మీ నగ మీ కిచ్చేస్తాను" అంటూ అతిదీనంగా ప్రాధేయపడ్డాడు నారాయణరావు ఆయన చేతులు పట్టుకొని.

లోపల నుంచి ఇంటి ఓనర్ భార్య మాటలు.

"గతిలేనప్పుడు ఆ నగ లెందుకు? ఆ షోకు లెందుకు తగుదునమ్మా అంటూ ఊరివారి నగలు పెట్టుకొని వెళ్ళకపోతేనేం?"

గోడ పక్కగా నుంచొని, ఏం జరుగుతుందో అని గుండె చేత్తో పట్టుకొని, బితుకు బితుకుమంటూ ఉన్న కీర్తనకి ఆ మాటలు వినగానే ఒళ్ళు చచ్చిపోయింది.

"నిజమే ! ఎరువు నగలు పెట్టుకొని పెళ్ళికి వెళ్ళకపోతే తను కీర్తన కాక పేరు మారుతుందా? ఛీ పాపిష్టి బ్రతుకు, ఎంత అవమానం" అనుకుంటూ కీర్తన వడివడిగా వారి పోర్షన్లోకి వచ్చి తలని మంచంకోడుకేసి కొట్టుకుంటోంది.

నారాయణరావు కీర్తన తల పట్టుకున్నాడు.

"ఎందుకలా తల బాదుకుంటావ్? చేసిన నిర్వాకం చాలక పైగా ఇదొకటా?" అతని మాటల్లో కోపంతో కూడిన విసుగు మిళితమైంది.

"మీరూ నన్నే అంటున్నారా? నలుగురిలో మెడ బోసిగా ఉంటుంది. అందులో మరిది పెళ్ళి. చూసేవారికి హుందాగా కనిపించాలని ఎరువు నగకి పంపించింది మీరే కదా !" అంటూ దెప్పింది నారాయణరావు మాటలకి బదులుగా కీర్తన.

"అవును ! ఎరువు నగ పెట్టుకోమన్నాను కాని పారెయ్యమనలేదుగా? సరే ఇప్పు డేం చెయ్యాలి? ఎలా డబ్బు సంపాదించడం? వారి నగ వారికివ్వడం ఎలా?" బుర్ర పట్టుకుకూర్చున్నాడు నారాయణరావు.

ఇద్దరూ రాత్రంతా బుర్రలు బద్దలుకొట్టుకున్నారు. ఒకరిమీ దొకరి ఆరోపణలూ-నిందలూ అయిన తరువాత ఒక నిర్ణయానికి వచ్చారు.

నారాయణరావు సిగరెట్లు మానెయ్యాలి. బద్ధకించకుండా డ్యూటీకి వెళ్ళాలి. ఒంట్లో బాగున్నా లేకపోయినా కంపెనీ ఇచ్చే ఓవర్టైము వదులుకోకూడదు. టీ, కాఫీలు మానెయ్యాలి. దగ్గరగా ఉన్న బస్స్టాప్ దగ్గర కాక, తరవాతి స్టాప్లో ఎక్కి టికెట్ దగ్గర పావలా మిగుల్చుకోవాలి. ఫ్రెండ్స్, సినిమాలు, షికార్లు,



ఆదివారాలు పేకాట ఉండకూడదు.

ఇక కీర్తన, వీధిలోకి వచ్చిన, నచ్చిన చీరల్ని బేరమాడకూడదు. రెండు పూటలకీ ఒకసారే వండాలి అది గ్యాస్ పొదుపు. తక్కువ ఖరీదు కూరలే వండాలి. పాల పాకెట్ ఒకటి తగ్గించాలి. పనిమనిషి ఉండదు. చాకలికి బట్టలు వెయ్యకూడదు. సంవత్సరం దాకా పుట్టింటికి వెళ్ళకూడదు.

దూరంగా తెలికోడి కూసింది. శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలు. ఉపాయం దొరకడంతో ధైర్యంగా ఊపిరి పీల్చుకొని నిద్రలోకి జారారు.

** ** **

మర్నాటి ఉదయం.

పోలీస్ లాఠీల కాఠిన్యానికి హూనమైన ఒంటిని కూడదీసుకుని గతిలేని చక్రమ్మ ఉస్సూరుమంటూ పనికి వచ్చింది.

"పోవే దొంగముండా ! చేసింది చాలక ఏ ముఖం పెట్టుకు వచ్చావే? అంత పని చెయ్యడానికి నీకు చేతు లెలా వచ్చాయే? మా బ్రతుకుల్ని బుగ్గిచేశావు కదటే" అంది కీర్తన.

ఇంటి ఓనర్ భార్య రాత్రి అన్న చురకల్ని జ్ఞప్తికి తెచ్చుకుని మరీ విజృంభించింది కీర్తన చక్రమ్మమీద.

"అమ్మాయిగోరూ, బగమంతుని సాచ్చి, నా మొగుడు, పిల్ల సాచ్చి నాను తియ్యనేదండి. నన్ను నమ్మండి. మీరు గిని పని మానిపించేత్తే ఈ ఊదంత నన్ను దొంగముండ అని పని సేయించుకోడం మానేత్తారమ్మా. నా జబ్బు మొగుడు, పోలియో పిల్ల...దిక్కులేని సావు సత్తావమ్మా ! నన్ను అన్నాయం సెయ్యకండమ్మా. నా జీవితాంతం మీ ఇంటికాడ పని సేత్తాను. పైసా డబ్బు లియ్యద్దు. మీ ఇంటికాడ కుక్కలా పడుంటాను" అని ప్రాధేయపడుతోంది చక్రమ్మ గుండె లవిసేలా ఏడుస్తూ.

"ఏమిటే మాట్లాడుతున్నావ్? నేను నీకు అన్యాయం చేశానా? ఎంత నంగనాచివే ! మంచి దానివని నమ్మి ను వ్వడిగిన చీర, ఇంట్లో ఏం చేసుకుంటే అది పెట్టినందుకు నట్టేట్లో ముంచావ్. ఛీ ఛీ ! ఫో అవతలకి !" అంటూ చక్రమ్మని ఏదిల్చికొట్టి తలుపులు మూసింది కీర్తన.

కిటికీలో నుంచి జరుగుతున్న దంతా గమనిస్తున్న నారాయణరావుకి చక్రమ్మ కళ్ళలో నిజాయితీ కనిపిస్తోంది. ఆ మాటల్లో ఎక్కడా తొణుకూ-బెణుకూ లేదు. మాట నిక్కచ్చి ఉంది. సరే అది తియ్యలేదనుకుంటాం. మరి నగ ఏమైనట్టు? దాని మాటలకు జాలిపడి ఏదైనా చేద్దామనుకున్నా ఏం చెయ్యలేని పరిస్థితి నారాయణరావుది.

** ** **

కాలగమనానికి ఒక సంవత్సరం తోడయింది. ఈ సంవత్సరంలో నారాయణరావు ఇంట్లో పొదుపు-ఉద్యమం అక్షరాలా అమలు జరిగింది. ఆ ఇంట్లో వేస్ట్ అన్నది మచ్చుకిలేదు.

ఆ రోజు నారాయణరావు జేబు బరువుగా ఉంది. ప్రతి పైసా తూచి-తూచి, దాచి, చీటీలు వేసి కూడబెట్టిన మొత్తం ఆరు వేలు.

ఎరువుసొమ్ము బరువు. ఈ సొమ్ముని ఎప్పుడు పోయిన నగకి బదులుగా ఇంటి ఓనర్ కిచ్చి బరువు తీర్చుకుని, ఒక నమస్కారం పెట్టాలా-అని ఎదురు చూస్తున్నాడు నారాయణరావు.

ఈ క్షణం కోసం ఈ సంవత్సరం అంతా నిరంతర కృషి చేశారు నారాయణరావు, కీర్తనలు. వారికి పొదుపు విలువ, డబ్బు మహిమ తెలిసింది. ఫలితం దక్కింది-పరువు నిలిచింది. నారాయణరావు, కీర్తనల కళ్ళలో ఆనందభాష్పాలు.

చెప్పుల్లో కాళ్ళు దూర్చి ఓనర్‌గారి దగ్గరకి బయలుదేరదా మనుకుంటున్న నారాయణరావుకి ఎదురుగా ఇంటి ఓనర్ తన భార్యని బరబరా ఈడ్చుకుని రావడం కనిపించింది.

ఈ దృశ్యాన్ని దిగ్భ్రాంతి చెంది చూశారు నారాయణరావు, కీర్తనలు.

"చెప్పవే లం..." అంటూ తన భార్యని గట్టిగా ముందుకు తోశాడు ఇంటి ఓనరు. ఆ ఊపుకి నారాయణరావు కాళ్ళ దగ్గర పడింది ఆమె.

"ఛీ ! ఛీ ! నా పరువు గంగలో కలిపావ్ కదే !" అంటూ కింద పడి ఉన్న భార్యని పైకిలాగి బలంగా వీపుమీద ఒక గుద్దు గుద్దాడు ఇంటి ఓనర్.

విషయం ఏమిటో తెలియక అయోమయంగా చూస్తున్న నారాయణరావు అప్పుడే స్పృహలోకి వచ్చినట్టు-"ఏమిటి సార్ ఈ అన్యాయం? ఎందుకు ఆవిడమీద చెయ్యి చేసుకుంటారు?" అంటూ ఇంటి ఓనర్‌ని మందలింపుగా చూశాడు.

"నీకేం తెలుసు నారాయణరావ్, ఇది మీ కెంత ద్రోహం చేసిందో ! మా ఆవిడకి-ఈ ముదనష్టపు ముండకి మొదటినుంచి కొంచెం చెయ్యివాటు తనం ఉంది. నేను డబ్బు దగ్గర కొంచెం జాగ్రత్త మనిషిని. ఇది నా రెండో పెళ్ళాం, నా భార్య పోతే దాని చెల్లెల్నే చేసుకున్నాను. దీనికి ఈర్ష్య లెక్కువ. మీ కుర్రవయస్సు కులుకులు, సినిమాలు, షికార్లు, జల్సాలు చూసి ఓర్వలేక మిమ్మల్ని దుఃఖపెట్టడానికి తన నగని తనే దొంగలించింది. మొన్న ఇంటి ప్లాన్ అర్జంటుగా కావలసి వచ్చి కనబడక బీరువా అంతా చిందర వందర చేస్తున్నప్పుడు చీరల మధ్యనుంచి పడింది కనపడని నెక్లెస్. మిమ్మల్ని అనవసరంగా చాలా ఇబ్బంది పెట్టాను. మీరు ఈ సంవత్సరమంతా ఎన్ని కష్టాలు పడ్డారో చూస్తున్నాను. నన్ను క్షమించు" అంటూ నారాయణరావు చేతులు పట్టుకున్నాడు ఇంటి ఓనర్.

వింటున్న నారాయణరావు, కీర్తనలకి ఓనర్ చెప్పిన మాటలు కాని, జరిగిన దేమిటో కాని చాలాసేపటివరకు అర్థం కాలేదు.

అర్థమైన తరువాత ఆ రాత్రి కీర్తన నారాయణరావుని ముద్దులతో ముంచింది.

"ఏమండీ, మనం ఇలాగే పొదుపుగా ఉంటే సంవత్సరానికి ఆరు వేలు కూడబెట్టవచ్చన్న మాట!" అంటూ-అంటే అయిదు సంవత్సరాలైతే, పది సంవత్సరాలైతే కూడపెట్టినవాడు మేడ కడతాడు. నిజమే. కీర్తన సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. ప్రస్తుతం ఈ ఆరు వేలతో ఏం చెయ్యాలో...ఎన్నో ప్లానులు వేసింది. కాని చక్రమ్మ గుర్తుకు రాలేదు.

కీర్తనయితే హాయిగా నిద్రపోగలిగింది కాని నారాయణరావుకు కంటికి కునుకు రాక ఎక్కడ చూసినా చక్రమ్మే కనిపిస్తోంది. ఆమె కళ్ళు అనుక్షణం గుర్తొచ్చి అతని గుండె మెలిపడుతున్నది.

కాలచక్రంలో చక్రమ్మని మరిచిపోగలిగినా ఎప్పుడైనా, ఎక్కడైనా చక్రమ్మలాంటి మనుషులు కనిపిస్తే గతం గుర్తొచ్చి నారాయణరావు కళ్ళు చెమరుస్తాయి.

*

## సర్వాంతర్యామి

టెలిఫోన్ తీగెలపై కూర్చున్న పక్షుల మీద
చెట్ల కొమ్మలపై గెంతే కొండ ముచ్చుల మీద
భావాన్ని భ్రూణహత్యచేసి కవితలు అల్లలేను

సంగ్రామ భూమి సరిహద్దుల్లో చిందిన వీరుల
నెత్తుటి బిందువుల్లో ఘనీభవించిన త్యాగశీలతని
నెత్రాపుల్లా దిక్కులకు వెదజల్లుతుంది నా కవిత

కటకటాల్ని మీటుకుంటూ కొరడవి చేరుకున్న
మొనగాళ్ళ గుండెల మొగిలిరేకుల మొనల్లోని
ఉద్యమ తీవ్రతని ఉటంకిస్తుంది నా కవిత

నరమాంసం తినమరిగిన గండభేరుండాల పైకి
విర్రవీగే డేగల విలాస జీవిత విపినం మీదికి
ఎర్ర పావురాల సైన్యాన్ని ఎగరేస్తుంది నా కవిత

జారిపోయే ఆశయాల ఆయుధాల్ని గుండెల్లో నిలిపి
జనపథాల్ని మొద్దు నిద్దుర నుండి మేలుకొలిపి
యుద్ధ భూమికి సంసిద్ధుల్ని చేసి సాగనంపుతుంది

మార్తాండ బింబాన్ని పార్థుడి గాండీవంగా చేసి
మయూఖ సమూహాన్ని మారణాస్త్రాలుగా మలిచి
శత్రు సంహారార్థం మిత్రుని చేతికి అందిస్తుంది

అవును... నా కవితకు కేంద్ర బిందువు సమరభూమి
సంఘర్షణాభావమే అందులో సర్వాంతర్యామి

-వీరపల్లె వీణావాణి